# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యువ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా ఖేలో ఇండియా క్రీడా పోటీలు నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ అనేక భాషలకు సంస్కృతం మాతృక వంటిదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ భారత దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తొలి ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025 ఈరోజు ఘనంగా ముగిసింది.
- ❖ ఐసిఎఆర్ తమ పరిశోధనలను నేరుగా రైతుల వద్దకు తీసుకెళ్లాల్సి అవసరం ఉందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఖేలో ఇండియా క్రీడలలో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. బీహార్ వేదికగా ప్రారంభమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. నిజమైన క్రీడా ప్రతిభను ప్రోత్సహించే వేదికగా ఇది నిలుస్తుందని అన్నారు. దేశంలో క్రీడా సంస్కృతి పెరిగిందని, ఖేలో ఇండియాలో విభిన్న దశల్లో క్రీడలను ప్రోత్సహిస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐపీఎల్ పోటీలో భీహార్ రాష్ట్రానికి చెందిన వైభవ్ సూర్యవంశీ అత్యుత్తమ ప్రదర్శన చేశాడని చెప్పారు. యువ క్రీడాకారులకు ప్రతిభకు వేదికగా ఈ క్రీడలు నిలవాలని అన్నారు. భారత్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలని కృషి చేస్తున్నామని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తొలి ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025 ఈరోజు ఘనంగా ముగిసింది. ముంబైలోని జియో కన్వెన్షన్ సెంటర్ వేదికగా నాలుగు రోజులపాటు జరిగిన ఈ

అంతర్జాతీయ కార్యక్రమంలో భారతీయ సినీ ప్రముఖులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో దేశాలనుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. 1300 కోట్ల రూపాయలకు పైగా వ్యాపార ఒప్పందాలు జరిగాయి. ఈ సదస్సులో భాగంగా నిర్వహించిన పోటీలలో 77 దేశాలకు పైగా వినోదరంగ ఔత్సాహికులు పోటీ పడగా, తుది జాబితాలో ఎంపికైన వారికి ఈరోజు సాయంత్రం ప్రశంసా పత్రాలను, అవార్డులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ వేవ్స్ సదస్సు అట్టహాసంగా ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

వేవ్స్ సదస్సు పెట్టుబడి, వ్యాపారం, కళ, సంస్కృతికి అద్భుతమైన వేదికని కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ముంబైలో వేవ్స్ లో భాగంగా ఈరోజు జరిగిన సాంస్కృతిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (CIC)లో పోటీ చేసిన సంగీతకారులు భారతదేశ ప్రత్యేకతను తమ ప్రదర్శనలలో చూపారని అన్నారు. భవిష్యత్ లో జరిగే అంతర్జాతీయ పర్యటనలలో CIC సంగీత పోటీల విజేతలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధ్యాయులు స్వయంగా సైకిళ్లను ఉపయోగించడం ప్రారంభించి, విద్యార్థులు కూడా వీటిని వినియోగించే విధంగా ప్రోత్సహించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో జరిగిన “ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్” కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. విద్యార్థులకు మార్గ దర్శకులగా నిలిచే ఉపాధ్యాయులు సైక్లింగ్‌ను ఫ్యాషన్‌గా మార్చగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఊబకాయ నియంత్రణ లక్ష్యాన్ని చేరడానికి, ఫిట్ ఇండియా, వికసిత్ భారత్ సాకారం కావడానికి ఉపకరిస్తుందని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో వైమానిక దళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో సమావేశమయ్యారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో ఈరోజు వాహనం అదుపుతప్పి 700 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు ఆర్మీ సిబ్బంది మరణించారు. ప్రమాదం జరిగిన వెంటనే, సైన్యం, పోలీసులు, SDRF, స్థానిక స్వచ్ఛంద సేవకులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు. మృతులను సిపాయిలు అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మాన్ బహదూర్‌గా అధికారులు గుర్తించారు. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దేశంలో వరి దిగుబడిని పెంచుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఐసిఎఆర్ ద్వారా భారతదేశంలో జన్యు మార్పు చేసిన రెండు వరి వంగడాలను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయ శాస్త్రవేత్తల సామర్థ్యంపై దేశానికి అపారమైన నమ్మకం ఉందని అన్నారు. ఐసిఎఆర్ తమ పరిశోధనలను నేరుగా రైతుల వద్దకు తీసుకెళ్లాల్సి అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశోధన వికసిత్ భారత్ సంకల్పంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

ఇది దేశానికి చారిత్రాత్మక రోజుగా నిలుస్తుందని చెబుతూ.. ఈ ప్రాజెక్టులో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ జ్ఞానం సంస్కృత భాషలో ఉందని, ప్రజలు సంస్కృత భాషను నేర్చుకుని ఆచరించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. న్యూఢిల్లీలో సంస్కృత భారతి నిర్వహించిన '1008 సంస్కృత ప్రసంగ శిబిరాల' ముగింపు కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొని ప్రసంగించారు. సంస్కృత భాష ప్రపంచ సమస్యల పరిష్కారానికి మార్గనిర్దేశం చేయగలదని ఆయన అన్నారు. అనేక భాషలకు సంస్కృతం తల్లి వంటిదని చెప్పారు. సంస్కృతాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఏప్రిల్ 23 నుండి ఈ నెల 3 వరకు సంస్కృత భారతి దేశ రాజధానిలో 1008 సంస్కృత ప్రసంగ శిబిరాలను నిర్వహించగా, ఈ శిబిరాల్లో 25 వేల మంది పాల్గొని సంస్కృత భాషను నేర్చుకున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO) మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ ట్రయల్ సైట్ నుండి స్ట్రాటోస్పియరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ అభివృద్ధి చేసిన ఈ ఎయిర్ షిప్‌ను ద్వారా దాదాపు 17 కిలోమీటర్ల ఎత్తుకు ఇన్‌స్ట్రుమెంటల్ పేలోడ్‌ను తీసుకువెళ్ళి ప్రయోగించారు. తొలి విమాన పరీక్ష వ్యవస్థ విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ DRDOని అభినందించారు. ఈ వ్యవస్థ భారతదేశ భూ ఉపరితలంపై పర్యవేక్షణ, నిఘా సామర్థ్యాలను పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోగ విజయం ప్రపంచంలోని ఇటువంటి స్వదేశీ సామర్థ్యాలను కలిగి ఉన్న కొన్ని దేశాలలో ఒకటిగా భారతదేశాన్ని నిలుపుతుందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ రంగాలకు చెందిన సమాచారాన్ని పాకిస్తాన్ దేశానికి చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని అమృత్‌సర్ గ్రామీణ పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు. అమృత్‌సర్‌లోని ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాలకు సంభందించిన సున్నితమైన సమాచారాన్ని, ఛాయాచిత్రాలను చెరవేశారనే సమాచారంతో పాలక్ షేర్ మాసిహ్, సూరజ్ మాసిహ్ లను పోలీసులు అదుపులోకి తెసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో అరెస్టు అయిన వారికి పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఈ అరెస్టును ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =